వాసవీ మాతా నమోస్తుతే !



హిందూపురం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు



గుడిబండ: వాసవీమాత చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



పెనుకొండ: నగర సంకీర్తనలో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోని వాసవీమాత ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

హిందూపురం: వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాల సందర్భంగా బుధవారం హిందూపురం కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారిని బంగారు వజ్రాల పట్టుచీరతో అలంకరించారు. గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే రాంబాబు పూజల్లో పాల్గొన్నారు. వాసవీ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఆర్యవైశ్యులందరూ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న దానం చేశారు. తర్వాత వాసవీ కన్యకాపరమేశ్వరి ఉత్సవమూర్తిని ముత్యాల పల్లకీలో కొలువుదీర్చి నగరోత్సవం నిర్వహించారు.

అగళి: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరిమేశ్వరి దేవాలయంలో వాసవి జయంతి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. 102 గోత్రాలకు తాంబూల సమర్పణ, సామూహిక అర్చన, కుంకుమార్చన, మహ మంగళహారతి, తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.

పెనుకొండ: పట్టణంలో బుధవారం వాసవీమాత జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించగా భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నగర సంకీర్తన చేపట్టారు.

గుడిబండ: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం వాసవీమాత జయంతి వేడుకలను నిర్వహించారు. ప్రత్యేక పూజలతో పాటు వాసవీ సహస్ర లలితా నామాలచే హోమాలను చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహంతో శోభయాత్ర జరిగింది.

మడకశిరరూరల్: పట్టణంలోని కన్యాకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించి పూజలు చేశారు. అనంతరం 340 అడుగుల పతాకాన్ని పురవీధుల గుండా ఊరేగించారు.

అమరాపురం: స్థానిక కన్యాకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ జయంతి ఉత్సవాన్ని ఆర్యవైశ్యులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని కలశాలను మోసుకొని గ్రామ వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

రొద్దం: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్య వైశ్య మహిళలు అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అనంతనం తీర్థప్రసాదాలు వంపిణీ చేశారు.

పావగడ: స్థానిక ఆంజనేయశెట్టి కల్యాణ మంటపంలో వాసవీ జయంతి వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం శిరా రోడ్డులోని నాగుల కట్ట వద్ద ఉన్న కూడలికి 'వాసవి సర్కిల్' గా నామకరణం చేసి సర్కిల్‌ను ప్రారంభించారు.

గోరంట్ల: వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వాసవీ ఆలయం వద్ద పతాకావిష్కరణ నిర్వహించారు. అనంతరం ఆనవాయితీగా రామ్మోహన్ గుప్త ఇంటి నుంచి అమ్మవారికి పట్టు వస్త్రలను సమర్పించారు. సాయంత్రం పురవీధుల గుండా వాసవీ మాతను ప్రత్యేక వాహనంలో ఊరేగించారు.



అమరాపురం: పూజలందుకున్న వాసవీమాత



మడకశిరలో..



అగళి: అలంకరణలో వాసవీమాత



పావగడ: కన్యకాపరమేశ్వరికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్



రొద్దం: వాసవీ మాతను దర్శించుకుంటున్న భక్తులు

క్లుప్తంగా

పేదల గుడిసెల తొలగింపు



గుడిసెలు తొలగిస్తున్న దృశ్యం

సోమందేపల్లి: మండల కేంద్రంలోని నల్గొండ్రాయనపల్లి క్రాస్ వద్ద సర్వే నంబరు 700లో నిరుపేదల వేసుకున్న గుడిసెలను పంచాయతీ అధికారులు బుధవారం తొలగించారు. దీంతో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలస్వామి, సీపీఐ నాయకులు రాజ్‌గోపాల చాంద్‌బాషా ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో దాదాపు 150 మంది దాకా పేదలు ఇంటి నిర్మాణాల కోసం గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారని, అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని తొలగించాలని చూస్తే హైకోర్టును ఆశ్రయించామన్నారు. కోర్టు స్టేటస్ కో ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ పంచాయతీ కార్యదర్శి రామాంజినేయులు, టీడీపీ పట్టణ కన్వీనర్ సూరి స్థలంలో ప్రవేశించి దౌర్జన్యంగా గుడిసెలు తొలగించినట్లు ఆరోపించారు. అధికారుల దౌర్జన్యంపై కోర్టు ధిక్కారణ కింద హైకోర్టును ఆశ్రయిస్తామని సీపీఐ నాయకులు తెలిపారు.

యోగాతో సుఖమయ జీవితం



యోగాసనాలు వేస్తున్న దృశ్యం

పరిగి: దీర్ఘకాలిక రోగాలను దూరం చేసే మహత్తరమైన శక్తి యోగాకు ఉందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కొడిగెనహళ్లిలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ప్రాంగణంలో వారం రోజుల పాటూ నిర్వహించనున్న హ్యాపీనెస్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ప్రోగ్రామ్ టీచర్ శ్రీనివాసరెడ్డి, ఆయుష్ యోగా శిక్షకులు శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ యోగా విన్యాసాలపై శిక్షణ ఇచ్చారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు నాగిరెడ్డి, నళినాక్షి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

13న జాబ్‌మేళా

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 13న జరిగే జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ జయప్ప తెలిపారు. 50 కంపెనీల ప్రతినిధులు వస్తున్నారని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అల్లూరికి ఘన నివాళి



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

లేపాక్షి: లేపాక్షిలోని రెవెన్యూ కార్యాలయంలో బుధవారం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తహసీల్దార్ సౌజన్యలక్ష్మి మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో తెల్లదొరలకు సింహస్వప్నంగా నిలిచిన పోరాటా యోధుల్లో అల్లూరి సీతారామారాజు ముఖ్యుడన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కూలీలకు పనులు కల్పించాలి

సోమందేపల్లి: ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్ కార్డు ఉన్న కూలీలకు పనులు కల్పించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నరేంద్ర కుమార్ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. రూ.300 కూలి తగ్గకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాలొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం

అగళి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, మందుల నిల్వలు, వేసవి కాలానికి సంబంధించి అవసరమైన మందులు, సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బందితో మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

హిందూపురం టౌన్: మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం పట్టణంలో ర్యాలీతో పాటు మున్సిపల్ కమిషనర్ చాంబర్ ముందు ధర్నా చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జగదీష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎన్నో ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా ఇంతవరకు ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదన్నారు. కార్మికులకు రావాల్సిన హెల్త్ క్లైమ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో పాటు మృతి చెందిన, 60 సంవత్సరాలు దాటిన వారి కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని అన్నారు. బకాయి ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ నిధులను ఆయా సంస్థలకు జమ చేయాలన్నారు. అలాగే సమ్మె కాలపు 16 రోజులకు వేతనాలను చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్, కమిషనర్ శ్రీనివాసులకు వినతిపత్రాలిచ్చారు. కార్మిక సంఘం నాయకులు మల్లికార్జున, రామచంద్ర, రంగనాథ్, గురునాథ, కవిత తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

పీఎఫ్ సొమ్ము కాజేసిన వారిపై చర్యలు తీసుకోండి

హిందూపురం టౌన్: మున్సిపాలిటీలో 220 మంది వర్కర్ల ఈఎస్ఐ, ఈపీఎఫ్ సొమ్ము రూ.4,94,000ను అడ్డదారిలో కాజేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్మికులు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ చాంబర్ వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్, జిల్లా కోశాధికారి బాబు, రైతు సంఘం నాయకులు చలపతి, కమల్ బాషా, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

హిందూపురం: కార్మికుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న చట్టాలపై కార్మికులు అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జ్ డి.వెంకటేశ్వర్లు నాయక్ పేర్కొన్నారు. బుధవారం ఆటో నగర్‌లో కార్మిక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ గతంలో చట్టాల గురించి తెలుసుకోవాలంటే న్యాయస్థానాలకు వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం న్యాయస్థానాలు, న్యాయమూర్తులు, న్యాయవాదులు ప్రజల వద్దకే వచ్చి అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు. తక్కువ ప్రీమియంతో అనేక బీమా సంస్థలు పాలసీలు అమలు చేస్తున్నాయని, ఆదాయ వనరులకు అనుగుణంగా బీమా సౌకర్యం పొందితే భవిష్యత్తుకు ఎంతో ప్రయోజనంగా ఉంటుందన్నారు. న్యాయవాదులు రవిచంద్ర , మురళి, మనోహర్, గురునాథ్, దివ్య, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్

పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యం

మడకశిరరూరల్: ఆర్ అనంతపురం, గౌడనహళ్లి పంచాయతీల్లో సేకరించిన సెజ్ భూముల్లో పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక దృష్టి పెట్టామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. బుధవారం ఆర్ అనంతపురం సమీపంలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండస్ట్రీయల్ (ఎంఎస్ఎంఈ) పార్కు నిర్మాణానికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు భూమి పూజ నిర్వహించారు.

అత్యవసర పరిస్థితులపై అవగాహన



హిందూపురం మార్కెట్ వద్ద మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న డీఎస్పీ మహేష్ , సిబ్బంది



పెనుకొండ: మాక్‌డ్రిల్‌లో ప్రజలకు సూచనలిస్తున్న అధికారులు



పరిగి: మాల్‌డ్రిల్‌లో పాల్గొన్న పోలీసులు

హిందూపురం: పాకిస్తాన్‌తో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో అత్యవసర పరిస్థితులపై పోలీసుల ఆధ్వర్యంలో డివిజన్ వ్యాప్తంగా రైల్వేస్టేషన్, బస్టాండ్ రహదారి కూడలి తదితర ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. డీఎస్పీ మహేష్ ఆధ్వర్యంలో సిబ్బంది అవగాహన కల్పించారు. అనంతరం సీఐలు రాజగోపాల్, అబ్దుల్‌కరీం, ఆంజనేయులు, ఎస్ఐ శ్రీధర్ తదితరులు తనిఖీలు చేపట్టారు.

పెనుకొండ: పాకిస్తాన్‌తో యుద్ధం నేపథ్యంలో పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. అత్యవర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులు వివరించారు. ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఎస్పీ నరసింగప్ప, తహసీల్దార్ శ్రీధర్, కమిషనర్ సతీష్‌కుమార్, సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఫైర్ ఆఫీసర్ వెంకటేసులు తదితరులు పాల్గొన్నారు.

పరిగి: ప్రస్తుతం దేశంలో జరుగుతున్న యుద్ధవాతావరణ నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు హసీనా సుల్తాన పేర్కొన్నారు.

లేపాక్షి: లేపాక్షిలోని వీరభద్రస్వామి దేవాలయ ఆవరణలో బుధవారం సాయంత్రం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాదులు దాడులు జరిగితే ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టాలి, ఎలా ఎదుర్కొవాలి అనే అంశాలపై వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఎస్ఐ నరేంద్ర, ఎంఈఓ నాగరాజు, మెడికల్ ఆఫీసర్ వెంకటచిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



లేపాక్షి: మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం

సంక్షిప్త సమాచారం

అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన

లేపాక్షి: మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో బుధవారం మండల వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళల సంరక్షణకు సంబంధించిన విషయాలపై ఎస్ఐ నరేంద్ర అవగాహన కల్పించారు. శక్తి టీం, డ్రగ్స్, పోక్సో కేసులను వివరించారు.

'పురం'లో బీఎస్పీ ర్యాలీ

హిందూపురం: రాష్ట్రంలో అత్యధికులైన బీసీలకు రాజ్యాధికారం బీఎస్పీతోనే సాధ్యమవుతుందని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతం కుమార్ అన్నారు. బహుజన సంకల్ప సభ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు అధ్యక్షతన అంబేడ్కర్ సర్కిల్‌లో రాజ్యాంగ్య నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ర్యాలీ నిర్వహించారు. బీసీల జీవితాలను మార్చడానికి మాయావతి కేంద్రంపై చేసిన ఒత్తిడి మేరకు కేంద్ర ప్రభుత్వం బీసీ కులగణనకు ఆమోదించిందన్నారు.

అధికారుల నిర్లక్ష్య వైఖరి తగదు

పావగడ: త్రైమాసిక ప్రగతి పరిశీలన సభకు గైర్హాజరైన అధికారుల వైఖరి సరికాదని, పనులు చేయడానికి ఇష్టపడని అధికారులు బదిలీపై వేరే చోటికి వెళ్లిపోవచ్చని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక తాలూకా పంచాయతీ సమితి సభా ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన తాలూకా స్థాయి త్రైమాసిక ప్రగతి పరిశీలన సభ లో ఆయన మాట్లాడారు. సభకు గైర్హాజరైన అధికారులకు నోటీసులు ఇవ్వాలని ఈఓ జానకిరాంను ఆదేశించారు.

కామెర్ల వ్యాధితో వ్యక్తి మృతి

రొద్దం: మండల కేంద్రంలో నివాసం ఉంటున్న నాయీ బ్రాహ్మణుడు ప్రసాద్ (50) కామెర్ల వ్యాధితో బుధవారం మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న నాయీ బ్రాహ్మణులు సంఘం సభ్యులు దహన సంస్కారాలకు మృతుడి కుటుంబ సభ్యులను ఆర్థిక సాయం అందించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కేబుల్ దొంగలను పట్టుకున్న రైతులు

గోరంట్ల: మండలంలో వరుసగా వ్యవసాయ బావుల బోర్ల వద్ద వ్యవసాయ పరికరాలతో పాటు కేబుల్‌ను ఎత్తుకెళ్తున్న సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం మండల పరిధిలోని కాగానిపల్లి వద్ద గల పొలాల్లో కేబుల్ వైర్లను అపహరిస్తుండగా రైతులు దొంగలను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులు విచారిస్తున్నారు.

భూసార పరీక్షలు చేసుకోవాలి

అగళి: రైతులు భూసార పరీక్షలు చేయించుకొని, దానికి అనుగుణంగా ఎరువులను వినియోగించాలని మండల వ్యవసాయ అధికారి శేఖర్ నాయక్ అన్నారు. మండలంలోని రైతు సేవ కేంద్రంలో రైతులు అధికారులను సంప్రదించి భూసార పరీక్ష చేయిచుకోవాలని సూచించారు.

కుల గణనకు సహకరించండి

పావగడ: తాలూకా వ్యాప్తంగా ఎస్సీ కాలనీల్లో ఈ నెల 15 నుంచి జరగనున్న కుల గణన ప్రక్రియకు సహకరించాలని స్థానిక తహసీల్దార్ వరదరాజు ప్రజలకు సూచించారు. 17 వరకూ జరిగే సర్వేలో భాగంగానే ఎస్సీలకు సంబంధించి 42 ప్రశ్నలకు సంబంధించి పూర్తి సమాచారాన్ని తెలియజేయాలన్నారు.

విగ్రహ ప్రతిష్ఠకు భూమి పూజ

హిందూపురం: పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని నంజుండేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో త్వరలో కాల భైరవస్వామి విగ్రహ ప్రతిష్ట చేయనున్నారు. ఇందులో భాగంగానే కాల భైరవ స్వామి విగ్రహ ప్రతిష్ట భూమి పూజలో అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ దంపతులు పాల్గొని పూజలు చేశారు.

ఉష్ణోగ్రత సమాచారం

హిందూపురం	36.0
పెనుకొండ	40.0
మడకశిర	36.0

ఘనంగా రామానుజ జయంతి



పూర్ణ కుంభ కలశాలు మోస్తున్న మహిళలు

పావగడ: తాలూకాలోని అరసికెరె గ్రామంలో రామానుజచార్యుల జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘం నాయకులు, మహిళల ఆధ్వర్యంలో రామానుజచార్యుల చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు. బ్రాహ్మణ మహిళలు పూర్ణ కుంభ కలశాలను మోశారు.

ఆర్మీకి మద్దతుగా జాతీయ జెండా ప్రదర్శన



జాతీయ జెండాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: ఆపరేషన్ సింధూర్ విజయవంతంతో బుధవారం నీలకంఠాపురంలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి ప్రజలు, విద్యార్థులతో కలిసి భారత ఆర్మీకి మద్దతుగా జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శత్రు నాశన హోమం నిర్వహించారు.

హర్షణీయం

పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకగా పాకిస్తాన్ ఉగ్ర స్థావరాలపై భారత్ ఆర్మీ సైన్యం చేసిన దాడులు విజయవంతం కావడం హర్షణీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి హర్షం వ్యక్తం చేశారు. ఉగ్రవాదులను అంతం చేస్తున్న భారత సైన్యం చర్యలు ప్రశంసనీయమన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు అందించిన అర్జీలకు సత్వరమే పరిష్కారం చూపాలని అధికారులకు తహసీల్దార్ లక్ష్మీనరసింహా సూచించారు. బుధవారం వీఆర్వోలతో ఆయన సమావేశమైన పలు సూచనలు చేశారు.

తవ్వారు.. వదిలేశారు



రోడ్డు పక్కనే గుంత తవ్విన దృశ్యం

చిలమత్తూరు: రోడ్డు పనుల కోసం బయట నుంచి మట్టి తీసుకువచ్చి తోలాలి. మండల కేంద్రంలో మార్కెట్ యార్డు వద్ద నుంచి వడ్డిచెన్నంపల్లి వరకూ నూతనంగా నిర్మించిన రహదారిలో కాంట్రాక్టర్లు సొమ్ము మిగుల్చుకునేందుకు అక్కడే మట్టి తవ్వి రోడ్డుకు వేయడంతో గుంతలు ఏర్పడ్డాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు మొద్దు నిద్రపోతున్నారు. ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు.

చెత్త సంపద రోడ్డు పాలు



గొరవనహళ్లిలో రోడ్డు పక్కనే చెత్తను పారవేసిన దృశ్యం

పరిగి: చెత్త నుంచి సంపద సృష్టించడం దేవుడెరుగు. వీధుల్లో ఉన్న చెత్తను సేకరించడానికి నెలకోసారి కూడా పంచాయతీ అధికారులు కృషి చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పరిగి మండలంలోని మోదా పంచాయతీ గొరవనహళ్లిలో పారిశుధ్య కార్మికులు సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు చేరవేయకుండా ఇలా రోడ్డు పక్కన పారేయడంతో స్థానికులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. రోగాల పడిన పడే పరిస్థితులున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.